సాక్షి చిత్తూరు

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళిక

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కాగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

- 8లో



మహిళలకు సుస్థిర జీవనోపాధి

మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు మెప్మా డైరెక్టర్ తెలిపారు.

- 8లో



కారు బోల్తా : మెడికో మృతి

తవణంపల్లె మండలం సత్తార్ బావి వద్ద శనివారం కారు బోల్తా పడి ఓ మెడికల్ విద్యార్థి మృతి చెందాడు.

- 8లో

న్యూస్‌రీల్

ఆస్ట్రేలియాలో యాత్ర-2 సంబరాలు



మెల్‌బోర్న్‌లో సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

పలమనేరు : ఆస్ట్రేలియాలోని వైఎస్సార్‌సీపీ అభిమానులు యాత్ర-2 సినిమాను శనివారం వీక్షించి సంబరాలు జరుపుకున్నట్లు పలమనేరుకు చెందిన పార్టీ నేత క్యూడీఎస్ రాజేష్ తెలిపారు. మెల్‌బోర్న్‌లో ముందుగా కార్ల ర్యాలీ నిర్వహించి, అనంతరం సినిమాకు వెళ్లినట్లు వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి కష్టాలను ఎదుర్కొని ముఖ్యమంత్రి కాగలిగారనే విషయాలను కళ్లకు కట్టినట్లు దర్శకుడు తెరకెక్కించారని ప్రశంసించారు.

అందరి సహకారంతో అభివృద్ధి



మాట్లాడుతున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని భక్తులు, దాతలు, ఉభయకర్తలు, స్థానికులు అందరి సహకారంతో అభివృద్ధి చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వరసిద్ధుని దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ప్రస్తుతం నిత్యం సుమారు 20వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకుంటున్నట్లు వెల్లడించారు. ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందించిన ఎన్ఆర్ఐలు ఐరా రవి, గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఇప్పుడు ఆలయ చరిత్రను వివరించే గ్రంథం ముద్రణకు నిధులు అందించారని వివరించారు. రెండు రోజుల క్రితమే ఈ పవిత్ర గ్రంథాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించామని తెలిపారు. గ్రంథాన్ని ఉభయకర్తలు పరిశీలించి తప్పు ఒప్పులను సరిచేసిన తర్వాత పూర్తిస్థాయిలో ముద్రించనున్నట్లు చెప్పారు. కాణిపాకం ఆలయ అభివృద్ధిలో ఉభయకర్తల పాత్ర కీలకమని, వారికి ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ మేరకు త్వరలోనే ఉభయకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

భయపడుతూ.. భయ పెడుతూ..!



ఎన్నికలు సమీపించే కొద్దీ చంద్రబాబు వెన్నులో వణుకు మొదలైంది. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల భయపడుతున్నారని టీడీపీ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే తనపై, ఆశావహులపై రోజుకొక సర్వే చేయించుకుంటున్నారు. ఆ సర్వేలో అభ్యర్థుల గురించి స్థానికులు వ్యతిరేకంగా సమాధానాలు ఇస్తుండడంతో తీవ్రంగా అంతర్మథనం చెందుతున్నారు. ఇక పొత్తులో భాగంగా తమకు సీట్లు దక్కుతాయో లేదోనని పలువురు ఆశావహులు ఆందోళన పడుతున్నారు.

- అభ్యర్థుల కోసం రోజుకొక పేరు తెరపైకి
- ఫోన్ సర్వేతో బయటపడుతున్న భయం
- ఓటర్ల ఫోన్లకు బాబు వాయిస్ మెసేజ్‌లు
- ఒకటి లేదా రెండు నొక్కమంటున్న చంద్రబాబు
- ఆశావహుల్లో ఆందోళన.. అధినేత తీరుపై ఆగ్రహం

నేను మీ చంద్రబాబుని మాట్లాడుతున్నాను. మీ అసెంబ్లీ అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది? ఏ అయితే ఒకటి నొక్కండి. బి అయితే రెండు నొక్కండి. నోటాకైతే మూడు నొక్కండి.

(చంద్రబాబు వాయిస్‌తో మొబైల్ ఫోన్లకు వస్తున్న రికార్డు వాయిస్ ఇది)

సాక్షి, తిరుపతి: చంద్రబాబు కొద్ది రోజులుగా ఫోన్ ద్వారా సర్వే చేయించుకుంటున్నారు. ఆ సర్వేల్లో తనకు, తన పార్టీకి వ్యతిరేకంగా చెబుతుండడంతో మరుసటి రోజు వేరొక అభ్యర్థి పేరుతో సర్వే చేయిస్తున్నారు. చంద్రబాబు చేపడుతున్న ఈ సర్వేపై ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. సర్వేలతో ఫలితాలు మారుతాయా? చెప్పే మాట, చేసే అభివృద్ధి పనులు సక్రమంగా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదా..? అని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీరుతో టికెట్ ఎవరికి ఇస్తారనే విషయం ఇప్పట్లో క్లారిటీ వచ్చే అవకాశాలు లేవని కుంగిపోతున్నారు.

తిరుపతిలో మాకు పరపతి ఏది?

తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిత్వం కోసం నాలుగు పేర్లతో సర్వే నిర్వహించారు. అందులో కేవలం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లతో మాత్రమే సర్వే నిర్వహించడంపై యాదవ సంఘం నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. చంద్రబాబు తీరుని టీడీపీ నేతలు బహిరంగంగానే ఎండగట్టారు. చట్టసభల్లో తమ సామాజికవర్గం వారిని పంపించే ఉద్దేశం లేదా? మేమేం పాపం చేశాం? సర్వే జాబితాల్లో కూడా అర్హత లేదా? అంటూ ధ్వజమెత్తారు. ఇదిలా ఉంటే.. ఈ సారి తమవర్గం వారికి ఇవ్వాలని కమ్మ సామాజిక వర్గం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

పొత్తు భయం

చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఆశావహుల్లో గుబులుపుట్టిస్తోంది. పార్టీని నమ్ముకుని ఇన్నాళ్లు ఉన్న తమని కాదని వేరొక పార్టీకి అప్పగిస్తే తమ గతేంటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పొరబాటున బీజేపీతో పొత్తు ఖరారైతే.. తిరుపతి పార్లమెంట్‌తో పాటు శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానాన్ని వదులుకోవాల్సి వస్తుందని టీడీపీ నేతలు భయపడుతున్నారు. అవే కాకుండా తిరుపతి, సూళ్లూరుపేట లేదా గూడూరు అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒకటి అడిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే జనసేన, బీజేపీ పంచుకోగా మిగిలినవి ఎన్ని? అని టీడీపీ నేతలు లెక్కలేసుకుంటున్నారు. ఓటమి భయంతో చంద్రబాబు మరింత దిగజారి పార్టీని నమ్ముకున్న నాయకులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నారు. చంద్రబాబుకి తనపై తనకు నమ్మకం లేకపోవడంతోనే పార్టీకి సేవలందించిన నేతలు నష్టపోవాల్సి వస్తోందని తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సారి కూడా పాయే!

శ్రీకాళహస్తి విషయానికి వస్తే.. సర్వేలో బొజ్జల సుధీర్‌రెడ్డికి బదులు భార్య బొజ్జల రిషితారెడ్డి పేరుని తెరపైకి తీసుకొచ్చారు. మిగిలిన వారెవ్వరి పేర్లు ప్రస్తావనకు తీసుకురాలేదు. దీన్ని బట్టిచూస్తే మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడికి్కూడా టికెట్ లేదని తేలిపోయింది. శ్రీకాళహస్తి టికెట్‌పై బోలెడు ఆశలు పెట్టుకున్న కమ్మ సామాజికవర్గం నేతలకు ఈ సారి కూడా మొండి చేయి ఇవ్వనున్నట్లు స్పష్టమైంది. పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డికి వ్యతిరేకంగా ఫలితాలు వెలువడడంతో బాబు పక్క చూపులు చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇకపోతే పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, సత్యవేడు, నగరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ చంద్రబాబు తడబడుతున్నట్లు తెలిసింది. ముందుగా అనుకున్న అభ్యర్థులకు వ్యతిరేకంగా ఫలితాలు రావడంతో పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

సమర్థవంతంగా సుపరిపాలన



ఉత్తరపుకండ్రిగ సచివాలయ భవన ప్రారంభోత్సవంలో మంత్రి రోజా



కోసలనగరంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. సమర్థవంతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శనివారం పుత్తూరు రూరల్ మండలం ఉత్తరపుకండ్రిగ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. జగనన్న ఆలోచన నుంచి ఆవిర్భవించిన సచివాలయ వ్యవస్థ ద్వారా మహాత్మగాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందన్నారు. ఫలితంగా అవినీతి రహిత పాలన ప్రజలకు చేరువైందని వెల్లడించారు. గతంలో మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనులు జరిగేవి కావని, నేడు వలంటీర్ల ద్వారా ప్రతి సంక్షేమ పథకం ఇంటి వద్దకే వస్తోందని వివరించారు. కోవిడ్ సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు క్షేత్రస్థాయిలో వేగవంతంగా సహాయక చర్యలు అందించి మన్ననలు పొందామని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. అదే జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని చెప్పారు. ప్రతి ఇంటికీ మంచి చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా, తనను నగరి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను గ్రామస్తులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ వెంకటవినోదరెడ్డి, ఏఈ వీరయ్య, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, సర్పంచ్ బుజ్జిబాబు, వైస్ సర్పంచ్ ఉదయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ రూరల్ మండలం అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ జనరల్ సెక్రెటరీ సుదర్శన్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, బాబు, వెంకటేశ్వర్లు, నరసింహులు, రాజయ్య, షణ్ముగం, నవీన్, యువరాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి ట్రేడ్ మార్క్ వైఎస్సార్‌సీపీ

విజయపురం (నగరి) : అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్ అని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శనివారం మండలంలోని కోసలనగరం గ్రామంలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మేనిఫెస్టో అంటే ఒక పవిత్ర గ్రంథంగా భావించి, ప్రతి హామీని నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ దృష్టిలో మేనిఫెస్టో అంటే ప్రజలను కనికట్టుచేయడానికి ఉపయోగించే మంత్రదండమని విమర్శించారు. కంటి ముందు కనిపించే అభివృద్ధి కావాలా? కనికట్టు కావాలా? అనే అంశంపై ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,593 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



గౌతమ్‌రెడ్డితో కార్మిక సంఘాల నేతలు

చిత్తూరు కార్పొరేషన్ : కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందని ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి తెలిపారు. శనివారం చిత్తూరు ట్రేడ్ యూనియన్స్ ప్రథమ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ దళారీ వ్యవస్థ నిర్మూలనకు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మున్సిపల్, అంగన్‌వాడీ కార్మికుల వేతనాలు పెంచిందని వెల్లడించారు. గత టీడీపీ హయాంలో ఒకరు మరణిస్తేనే మరొకరికి కొత్తగా పింఛన్ మంజూరు చేసేవారని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలోనే ఎక్కువ మందికి పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా కీర్తి గడించిందని వివరించారు. తిరుపతిలో ఐటీ హబ్ పెడతామని బాబు మాయమాటలు చెప్పారని విమర్శించారు. యూనియన్ అధ్యక్షుడు మాలిక్ మాట్లాడుతూ నగరంలో 8 కార్మికుల సంఘాలతో ట్రేడ్‌యూనియన్‌గా ఏర్పడినట్లు వెల్లడించారు. మినీగూడ్స్ వెహికల్స్ మరమ్మతు కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్మికులకు స్కిల్ శిక్షణ ఇవ్వాలని సూచించారు. యూనియన్ రీజనల్ అధ్యక్షుడు వెంకటప్పరెడ్డి, రాజారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌టీయూసీకి అనుబంధంగా 152 యూనియన్లు ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత భూపేష్ మాట్లాడుతూ కార్మిక సంఘాలన్నీ ఒక్కతాటిపై రావడం అభినందనీయమన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం గౌతమ్‌రెడ్డి చేతుల మీదుగా పలువురు కార్మిక సంఘాల నేతలను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇందు, కార్మిక సంఘాల నేతలు చిన్నమ్మ, రాజేష్‌కుమార్, రఘురామ్‌రెడ్డి, చిన్నయల్లప్ప, ఉపేంద్ర, రఫీ, కరీముల్లా, మున్నెప్ప, మహమ్మద్‌రఫీ, మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని కుటుంబానికి పరామర్శ



నగదు అందిస్తున్న ఎమ్మెల్సీ ఏసురత్నం

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని తాణా వేణుగోపాలపురంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబాన్ని గుంటూరుకు చెందిన ఎమ్మెల్సీ ఏసురత్నం శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూ.లక్ష, వడ్డెర ఉద్యోగుల సంఘం తరఫున రూ.70వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు మణి, వడ్డెర ఉద్యోగస్తుల ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు గంజి శ్రీనివాసులు, తన్నీరు రాయల్‌బాబు, దుర్గం రాధమ్మ, నాయకులు భాస్కర్, పెద్దన్న, మనోహర్, కుమారి పాల్గొన్నారు.

మాయగాడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: వృద్ధులను మోసం చేసి బంగార నగలు అపహరిస్తున్న మాయగాడిని శనివారం చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు..తిరుపతి చెందిన మహేష్ అనే వ్యక్తి పింఛన్ ఇప్పిస్తానంటూ వృద్ధులకు మాయమాటలు చెప్పి, ఫొటో తీయించే పేరుతో తీసుకెళ్లి దోచుకునేవాడు. మహేష్‌పై పలు కేసులు నమోదైన నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మాయగాడి నుంచి రూ.2లక్షల విలువైన 25 గ్రాముల నగలు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్‌షావలీ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

తిరుమల: తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీపురందరదాసుల ఆరాధనా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తనం, హరిదాస రంజని కళాకారులతో సంగీత కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి 3,500 మందికి పైగా భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

ప్రియురాలు పట్టించుకోలేదని..!

- గొంతుకోసుకున్న ప్రియుడు
- పరిస్థితి విషమం
- పలమనేరు సమీపంలోని ఓ లాడ్జిలో ఘటన



లాడ్జిలో గొంతుకోసుకున్న జైప్రకాష్ (ఇన్‌సెట్) జైప్రకాష్ (ఫైల్)

పలమనేరు : ప్రియురాలు పట్టించుకోలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. శనివారం పలమనేరు సమీపంలోని ఓ లాడ్జిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. పూతలపట్టు మండలం వేనూతనపల్లె పంచాయతీ కూటంవారిపల్లెకు చెందిన గోవిందస్వామి కుమారుడు జైప్రకాష్(33) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో అక్కడ ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఆమెకు ఇది వరకే వివాహమై భర్తకు దూరంగా ఉంటోంది. క్రమేణా జైప్రకాష్‌తో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇదే సమయంలో జైప్రకాష్ తమ గ్రామంలో ఇంటి నిర్మాణం సైతం ప్రారంభించాడు. బెంగళూరులో బాగా డబ్బులు సంపాదిస్తున్నానని గ్రామస్తులకు చెప్పేవాడు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ, వారం రోజుల క్రితం పలమనేరుకు వచ్చి ఓ లాడ్జిలో దిగాడు. ఎక్కువ సమయం గదిలోపలే ఉండేవాడు. రూమ్ అద్దె సైతం కట్టకపోవడంతో లాడ్జి నిర్వాహకులు గట్టిగా మందలించారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం గదిలో పూటుగా మద్యం సేవించి తన ప్రియురాలితో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మళ్లీ గొడవపడినట్టు తెలిసింది. వెంటనే తన వద్ద ఉంచుకున్న పదునైన బ్లేడ్‌తో జైప్రకాష్ గొంతును కోసుకున్నాడు. గదిలో నుంచి అరుపులు రావడంతో లాడ్జి సిబ్బంది తలుపులు పగులగొట్టి ఓపెన్ చేశారు. రక్తపుమడుగులో పడిఉన్న జైప్రకాష్‌ను వెంటనే 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పీక తెగడంతో పరిస్థితి సీరియస్‌గా ఉందని నాలుగు గంటల్లోపు సర్జరీ చేయాలని తెలిపారు. ఆ మేరకు చిత్తూరులోని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మహిళలకు సుస్థిర జీవనోపాధి



చపాతీ యూనిట్ ప్రారంభిస్తున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

తిరుపతి తుడా: మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నారని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష కొనియాడారు. తిరుపతిలోని అనుస్ సంస్థ ప్రాంగణంలో రాష్ట్రంలోని అర్హులైన డ్వాక్రా సంఘ సభ్యులకు వివిధ కోర్సులపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం వారు అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ శిక్షణకు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ఆసక్తి కలిగిన స్వయం సహాయక సంఘ సభ్యులను ఎంపిక చేశామన్నారు. వారు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు. మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్టులు, జగనన్న ఈ - మార్టులు, బ్యూటీషియన్ కోర్స్ తదితర వాటిని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, జగనన్న తోడు వంటి పథకాలను మహిళల కోసం అమలు చేస్తున్నారని వివరించారు. అనుస్ ఎండీ అనూరాధ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మహిళలను నిపుణులైన బ్యూటీషియన్లుగా తీర్చిదిద్దుతామన్నారు. శిక్షణ పూర్తయిన వారికి తమ సంస్థలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ, మెప్మా ఏఓ రామాంజనేయులు, మెప్మా ఎస్ ఎంఎం ఆదినారాయణ, ఎస్‌ఎస్‌ఆర్ శ్రీనివాస్, తిరుపతి సీఎంఎం కృష్ణవేణి, తిరుపతి మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి స్వర్ణ హారం



ఆలయ అధికారులకు బంగారు కాసుల హారం అందజేస్తున్న దాతలు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కాసుల హారాన్ని శనివారం విరాళంగా అందజేశాడు. ఈ మేరకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, సూపరింటెండెంట్ శేషగిరికి హారాన్ని అందజేశారు. తెలంగాణ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన అశ్విని పుష్పాల తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం రూ.9.22 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు కాసుల హారాన్ని అమ్మవారికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ స్వామి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళిక



హంద్రీ- నీవా కాలువను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శాంతిపురం : రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతిపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. పోలీసుశాఖతో సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్తు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం చేసుకోవాలని కోరారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా ఎన్నికల సెల్ అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.

కృష్ణా జలాల పరిశీలన

రామకుప్పం: మండల పరిధిలోని వర్దికుప్పం,రాజుపేట గ్రామాల సమీపంలో హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. కుప్పానికి నీరు చేరుకునే రూట్ మ్యాప్‌పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మద్దికుంట చెరువుకు నీరు మళ్లించే పనులను సందర్శించారు. మిట్టపల్లె వద్ద బహిరంగ సభ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ జాషువా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్, పార్టీ నియోజక వర్గ పరిశీలకుడు రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ ఆరేళ్ల జయప్ప పాల్గొన్నారు.

కారు బోల్తా : మెడికో మృతి

- నలుగురికి గాయాలు



లిఖిత్‌కుమార్ రెడ్డి మృతదేహం

తవణంపల్లె : మండలంలోని సత్తార్‌బావి వద్ద కారు బోల్తా పడిన ఘటనలో మెడికల్ విద్యార్థి మృతి చెందాడు. మరో ముగ్గురు మెడికోలు గాయపడ్డారు. వివరాలు.. చిత్తూరులోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎం.శశిభూషణ్, ఆర్‌ఆర్‌కే త్రిలోక్, పి.భరత్, వి.వెంకటేష్, ఎ.లిఖిత్‌కుమార్‌రెడ్డి ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నారు. భరత్, లిఖిత్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని మిత్రులందరూ కలిసి శుక్రవారం ఐరాల మండలంలోని ఆర్‌కే రిసార్ట్‌లో వేడుకలు జరుపుకున్నారు. శనివారం వేకువ జామున సుమారు 3 గంటల సమయంలో కారులో చిత్తూరుకు తిరుగుప్రయాణమయ్యారు. కారు వేగంగా వస్తూ అదుపు తప్పి సత్తార్‌బావి వద్ద కల్వర్టు గోడను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా లిఖిత్‌కుమార్‌రెడ్డి అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన నలుగురు విద్యార్థులు చికిత్సపొందుతున్నారు. పుట్టిన రోజు నాడే లిఖితకుమార్ రెడ్డి మృతి చెందడంతో తల్లితండ్రులు, బంధులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాజేంద్ర తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గిరిబాబు మృతదేహం

పలమనేరు : మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లె వద్ద పలమనేరు-కుప్పం రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గంగవరం మండలం మారేడుపల్లెకు చెందిన గిరిబాబు(33) సొంత పనిమీద వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గిరిబాబు మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.